

# నిప్ప పిట్ట, ఎర్ర కుందేలు మరియు అదృశ్యమవుతున్న జాతుల కథ





టేబుల్‌పై ఎదురుగా మెదడు. ముదురు ఇటుకరంగు సూప్ మధ్యన వేలాడుతూ. మెత్తగా, మృదువుగా ముడతలు ముడతలుగా. తినడానికి ముందు చాలాసేపు దానివైపే చూస్తూ, "సముద్ర గుహలు, భయపు కోటలు, కలల రాత్రులు" అని అర్ధోక్తిగా ఆగి 'వీటిని నేనొక నాస్టాలిజియా కోసం తింటుంటాను" అన్నది మోహిని. 'నాడు పొట్టేలు తలను చీల్చి, నేర్పుగా బయటకు లాగి - దీన్ని తింటున్నప్పుడు నాకా విధ్వంసం గుర్తుకొస్తుంది'. హఠాత్తుగా ఒక కాఫ్కా తరహా మనోవిభ్రమలోకి వెళ్ళిపోయింది మోహిని. మరచిపోయిన బాల్యం, జ్ఞాపకాలను కొరికి తింటున్నట్టు, ఒక సంచలనం. ఒక దుఃఖం, నా పంటి కింద మెత్తగా నలిగేది ఒట్టి ప్రొటీనే, ఏనిమల్ ప్రొటీనే. కానీ ఒక ఫ్లాష్‌బాక్‌ని నిద్రలేపటానికి ఇట్లా కసిగా..."

అల్ఫా హోటల్. మొదటి అంతస్తులో ఒక మూలన కూర్చొని, ఎదురుగా రైల్వేస్టేషన్. తొక్కుకొంటూ, తోసుకొంటూ పాతకాలపు ఇంగ్లీషు వార్ సినిమాలో దృశ్యంలా. తెర మొత్తం జనంతో నిండిపోయి, అట్లా నిరంతరం కదిలిపోతున్నట్టుగా. జీవితంలో ప్రయాణం తప్ప మరో సంగతి లేనట్టుగా, రోడ్డు నిండా జనం.

మేం కూర్చున్న టేబుల్ పక్కనే ఇనుప మెష్. మెష్‌పై బ్రిప్.... బ్రిప్... అంటూ శబ్దం చేస్తున్న పావురాళ్ళు. వాటి అరుపులంటే మోహినికి ఇష్టం. 'దీవిస్తున్న తల్లుల్లా అవి మెష్‌పై కూర్చుని... ఈ దృశ్యం నాకిష్టం!' అంటుంది. హఠాత్తుగా ఏదో గుర్తుకొచ్చినట్టుగా ఆ పావురాళ్ళు రెక్కలు విప్పి ఇంకో గోడపైకి డైవ్ చేస్తాయి. కొన్ని బద్ధకంగా రెక్కలు విప్పకుండానే శరీరాల్ని గాలిలో వేలాడదీసినట్టుగా కదుల్తాయి. 'బద్ధకంలో కూడా ఎంత క్రియేటివిటీ! ఈ సిటీ గాలిలోనే వుంది క్రియేటివిటీ!' అని ముచ్చటపడింది మోహిని.

పర్సులోంచి పాకెట్ రేడియోని బయటకుతీసి, లాటరీ వేసినట్టుగా మొదట వినపడ్డ శబ్దాన్ని, ట్యూన్ చేసి, ఎదురుగా టేబుల్‌పై పెట్టింది. అపరిచితుడెవరో ఎదురుగా కూర్చొని, శబ్దాల్ని, పదాల్ని మనపైకి విసిరివేస్తున్న అనుభూతి కోసమట. మరో మనిషి పక్కనే కదలాడుతున్న మాయాస్పర్శ కోసమట.

తింటున్న రొట్టెను అట్లాగే ప్లేట్‌లో వదిలేసి, తన బ్యాగ్‌లోంచి లెదర్ ఫైల్ బయటకు తీసింది. అందులోంచి ఒక రీసెర్చి రిపోర్టును తీసి నాపైకి

విసిరింది. "ఎంత పొగరు! ఎంత విషం! మీ 'Y' జీన్‌లోనే వుంది ఈ సంకుచత్వం!" అంటూ హెచ్చరిక లేని యుద్ధాన్ని ప్రకటించింది. ఒక సోషయలాజికల్ సర్వే రిపోర్టు అది. ఫెమినిస్టు ఉద్యమాలు. ఉన్నత ఉద్యోగాల నిర్వహణ కారణంగా స్త్రీలలో సున్నితత్వం, స్పందన నశిస్తున్నాయని, మరి కొన్నాళ్ళకు సౌందర్యం, ప్రేమ, దయగల స్త్రీలు అంతరించిపోతున్న తెగల జాతిలోకి చేరతారని వివరించే రిపోర్టు అది.

ఈ కోపాన్నీ, ఈ అసహనాన్నీ, క్షణక్షణం మారే ఉద్వేగాల్నీ అట్లా తన ఎదురుగా కూర్చొని ఆనందించటం నాకిష్టం. మోహిని నాకు స్నేహితురాలు మాత్రమే కాదు. తనో మెటాఫర్. గమ్మత్తుగా, గాఢమైన నిజంలాగా ఒట్టి కల లాగా, అనిపించే ఆమె స్నేహం – ఈ సిటీలో బతకడానికి నాకు అవసరమైన ప్రాణవాయువు.

వేడిరొట్టెను తెచ్చి టేబుల్‌పై పెట్టాడో కుర్రాడు. మందంగా ఆకలిని సవాలు చేసేదిగా వుందా రొట్టె. దాన్ని సగంచేసి నా ప్లేటులోకి విసిరింది.

తింటూ ఏదో గుర్తుకొచ్చినవాడిలా, "రాత్రి నాకో చిత్రమైన కల వచ్చింది" అన్నాను సన్నని నవ్వుని పెదాల మధ్యన ఇరికించుకొంటూ.

"కొత్త మిలీనియం కోసం ఉత్సవాలు జరుగుతున్నాయట. పెద్ద ఆడిటోరియమ్. స్టేజిపై మాట్లాడుతున్నాను నేను. నేను మాట్లాడే మాటలన్నీ సంగీతంగా మారిపోతున్నాయట!"

"ఇంటరెస్టింగ్! ఏ సంగీతం?"

కొద్దిగా బుర్ర గోక్కుని, "క్లాసికలే... వయొలిన్ రాగాలో, మృదంగ ధ్వానాలో..." అన్నాను.

"అదృష్టవంతుడివి! నా కలల్లో ఇట్లాంటి సంగీతాలు, సుందరమైన విషయాలు రావడం మానివేసి చాలా కాలమైంది. నా కలల్లో ఎడారులు, ఊపిరి ఆడనీయని సముద్రాలు, మనుషులు మరణించటం కనిపిస్తుంటాయి. మరణించిన మనుషులు పునరుత్థానమయ్యే కలకోసం ఎదురు చూస్తున్నాను, చాలారోజులుగా".

మోహిని మాటల్ని మధ్యలోనే ఆపివేస్తూ "ఇవాళ ఈ శతాబ్దానికే, మిలియనమ్‌కీ చివరిరోజు" మెదడు ముక్క పంటికింద మెత్తగా నలుగుతుండగా గుర్తు చేశాను. నా కంఠంలో సన్నగా వణుకు. "సో యువాంట్ టు సెలబ్రేట్" అంది నిర్లిప్తంగా. క్షణం ఆగి "ఒక షరతు! ఇరుకు లాడ్జీ గదులలోనో, కక్కసు దొడ్ల పక్కనో, కంగారు కంగారుగానో, అట్లాంటిచోట వద్దు. కొంచెం ఆహ్లాదంగా, క్రియేటివ్‌గా వుండే ప్రదేశం చూడు" అంది.

"రెడ్డివాళ్ళు వుండే కూకట్‌పల్లి ప్రగతినగర్ గుర్తుంది కదూ! పెద్ద చెరువు, చెరువు గట్టున అద్భుతమైన రాక్స్, విల్ ఇట్ బి ఓకే!" అన్నాను హుషారు నిండిన కంఠంతో. 'ఊ...' అంది.

* * *

"చావుకు భయపెట్టే గుణం పోయింది. ఇప్పుడు అందర్నీ భయపెట్టేది మానవ సంబంధాల ధ్వంసం. వ్యాధి కన్నా, చావు కన్నా ఎక్కువగా భయం కలిగించేవి మనుషుల్లోపలి ఎడారులు." వీధి పిల్లల కోసం ఏర్పాటు చెయ్యబడ్డ ఎన్.జి.ఓ.లో మోహిని సైకాలజిస్ట్. వీధిపిల్లల మనస్తత్వంపై ఎన్నో పరిశోధనల్ని చేసింది మోహిని. "ఈ పిల్లల్లో పెరుగుతున్న ఎడారులు చూస్తే భయం వేస్తుంది. ఒక చిన్న పిసరు పచ్చికను వీళ్ళ గుండెల్లో పెంచగలమా అనిపిస్తుంది" అంటుంది. "వాళ్ళిచ్చేవి రెండు వేలే అయినా, ఈ ఉద్యోగం నాకెంతో అవసరం. ఈ పిల్లలతో గడపుతున్నప్పుడు నాకెంతో ఊరటగా ఉంటుంది. నా లోపలా ఒక ఎడారి వున్న విషయం నాకు స్పష్టంగా తెలుస్తుంది. దుఃఖం, ప్రేమ, సెక్స్ దేనికీ స్పందన కలగని ఎడారి" ఈ మాటలంటున్నప్పుడు, మోమిని కళ్ళలో నీటి తెర.

మోహిని చెల్లెలు పద్ధెనిమిదేళ్ళ కమల ఈమధ్యనే ఫాన్‌కి ఉరివేసుకొని చచ్చిపోయింది. పెద్దగా కారణం ఏమీ లేదు. ఎందుకో తనకు పెళ్ళి కాదనే భయం ఆ పిల్లకు పట్టుకొంది. ఫెమినిస్ట్ అక్కను చూసినప్పుడల్లా - పెళ్ళి తనకో తప్పనిసరి అవసరంగా తోచేది. కట్నమూ ఇవ్వలేని, ఉద్యోగము లేని తనకు పెళ్ళి కాదని, ఆ పిల్ల అట్లా చావుకు లొంగిపోయింది. ఉదయం పది గంటలకు యూనివర్శిటీకి ఫోన్ చేసింది మోహిని. హడావిడిగా వెళితే - గడపపై నిర్లిప్తంగా మోహిని. ఎదురుగా శవం. చచ్చిపోయిన కమలకు పెంపుడు కుక్క ఉండేది. అది మగదో - ఆడదో తెలియదు గానీ దానికి 'మృత్యుంజయ' అని పేరు పెట్టుకొంది. ఆ కుక్క ఒక్కతే దిగులుగా కుయ్ కుయ్ మంటూ చచ్చిపోయిన పిల్ల చుట్టూ తిరుగుతుంది. "క్రెమటోరియంలో దీనిని కూడా విసిరివెయ్యనా?" అంది మోహిని. ముఖంలో పెద్దగా కదలికేం లేదు. ఆవేల్టి మోహిని రూపం ఇప్పటికీ నాకు భయం గొలిపేదిలా గుర్తుకొస్తుంది. "కళ్ళు కనబడని అమ్మ ఆరొందల కిలోమీటర్ల నుంచి రావాలి. పిలవదలచుకోలేదు. అది లేచిపోయిందని చెబుతాను. వాడెవడో విద్యలు సరిగారాని మాంత్రికుడితో వెళ్ళిపోయిందని చెబుతాను." తమాషాకు అనుకొన్నాను. నిజంగానే వాళ్ళమ్మకు అట్లాగే కబురుచేసింది. కుక్కను క్రెమటోరియమ్‌లో విసిరేసే ఆలోచనను మాత్రం మరిచిపోయింది. బ్లూక్రాస్ వాళ్ళ ఆఫీస్‌లో వదిలి వచ్చింది.

హోటల్ దిగి రోడ్డుపైకొచ్చాము. రోడ్డు అంచునే అట్లా మాట్లాడు కొంటూ – అటూ ఇటూ మనుషులు. నది అంచునే ప్రయాణిస్తున్న అనుభూతి. చెమట, దుర్గంధం, రోడ్డుపక్కన తినుబండారాలు, టీస్టాళ్ళ నుంచి టీ ఘుమ ఘుమలు, పరిచిన గుల్దస్తాల్లోంచి వచ్చే మత్తువాసన అన్నీ కలగలిపి వింతగా కొత్తగా వుండే హైదరాబాదు వాసన. అట్లాగే మనుషుల్ని దాటుకొంటూ చాలా దూరం నడిచాము. మమ్మల్ని వొరుసుకొంటూ వెళ్ళే కార్లు, స్కూటర్లు. యుద్ధం మధ్య వున్నట్టు. ఇక్కడ ప్రయాణం కూడా ఒక యుద్ధక్రీడ. ఇక చాలు ఏదైనా బస్సు ఎక్కుదాం అంటూ స్టాప్‌లో కూలబడింది మోహిని. సికింద్రాబాద్ పారడైజ్ సెంటర్ అది. ఎదురుగా పారడైజ్ హోటల్. హోటల్ ముందు యాభైమంది దాకా మూగి 'టీ'ని ఎంజాయ్ చేస్తున్నారు. మా ముందు నుంచి ఇద్దరు కుర్రాళ్ళు 'పతంగా!' 'పతంగా!' అని అరుచుకొంటూ గాలిపటాల్ని మోసుకెళుతున్నారు. పది పదిహేను రంగులు. అవి గాలికి రెపరెపలాడుతూ, రోడ్డు ఒక రంగుల కలలా మారిపోయింది. వాణ్ణి ఆపి ఐదు రూపాయలకో గాలిపటం కొనుక్కొంది మోహిని. దాని దారం కొసను పట్టుకొని అటూ ఇటూ ఎగరేస్తూ, ఇంద్ర ధనుస్సును భుజంపై తగిలించుకొన్నదానిలా వుంది.

కొద్ది నిమిషాల తరువాత ఈ రంగులు, ఇంద్రధనుస్సుల మోహ వాతావరణం మాయమైపోయింది. రోడ్డు మౌనంగా ఒంటరి సంతాపకుడిలా మారింది. పదిహేను ఇరవైమంది బాడ్జీలు పెట్టుకొన్నారు. చేతుల్లో 'మానవ హక్కుల పోరాట సమితి' అంటూ బేనర్. మౌనంగా, గొప్ప విశ్వాసంతో నడుస్తున్నారు వాళ్ళు. పద అంటూ లేవదీసి ఆ ఊరేగింపు వైపు నడిచింది మోహిని. ఊరేగింపు వెనుకనే ఇద్దరం చాలాసేపు నడిచాం. ఎవరో నల్ల రిబ్బన్లు మాకు అందించారు. టాంక్‌బండ్ దగ్గరవుతుండగా ఊరేగింపులోంచి జారిపడి, మళ్ళీ రోడ్డుపైన తేలాము. "ఇక బస్సు ఎక్కుదాం!" అంటూ బస్‌స్టాప్ వైపు నడిచింది మోహిని.

'రా! ఆఫీసుకు వెళదాం. ఒక ఆసక్తికరమైన సెమినార్ జరగబోతోంది' అంటూ అయిదో నెంబరు బస్సులోకి నన్ను లాగింది.

ROPE – (రీసెర్చి అండ్ ఓరియంటేషన్ ఆఫ్ సైకలాజికల్ ఎన్విరాన్‌మెంట్) అనే ఎన్జీవో సంస్థ. ఆఫీసు ముందో షామియానా వేసి వుంది. కుర్చీలు సర్దుతూ, బానర్లు కడుతూ హడావుడిగా వున్నారు సంస్థ ఉద్యోగులు.

మోహిని గదిలో అద్భుతమైన పూలవాసన. టేబుల్‌పై అందమైన పూలదండలు, బొకేలు.

"ఇదో వింత సెమినార్. మనసును జీరో దగ్గరకు తీసుకురావడం, మనసులోని బాధ కలిగించే జ్ఞాపకాల్ని తొలగించివేయడం. 'లోబోటమీ' అనే

మెదడు సర్జరీ వుంది. ఆ సర్జరీ తరువాత మెదడు లోపలి జ్ఞాపకాల రికార్డులన్నీ చెరిగిపోతాయి. ఇవాళ తప్ప నిన్న వుండదు. అట్లాంటి ప్రభావాన్నే సర్జరీ లేకుండా ఈ సెమినార్‌లో సాధిస్తారు. మరణపు బాధ, వెంటాడే బాల్యం, దుఃఖం, ఆందోళన, రేపటి గురించి చింత అన్నీ చెరిగిపోతాయి. తాజాగా, నిర్మలంగా, నెలల పసివాడి మనసులా మారిపోతుంది మనసు. జపాన్ నుంచి ఇద్దరు సైకాలజీ ప్రొఫెసర్లను పిలిపించారు ఈ సెమినార్ కోసం."

బయట హడావుడి మొదలైంది. ఒక్కొక్కళ్ళే డెలిగేట్లు రావడం మొదలు పెట్టారు. నలభై, యాభై దాటినవాళ్ళు. మిగిలినవాళ్ళు టీనేజర్లు. గదిలోంచి బయటకు వచ్చాం. అయినా పరిమళం పోలేదు. మధురమైన వాసన అట్లాగే వుంది. జ్ఞాపకాల్ని తీసివేయడం సాధ్యమయ్యే పనా? బయట మంత్రి వచ్చినట్లున్నాడు. హడావుడి! "రా! సెమినార్‌లో కూర్చుందాం" అంటూ ముందుకు నడిచింది మోహిని.

"మోహినీ! నువ్వు ఎందుకు చేరకూడదు?" అన్నాను ఏదో గుర్తుకొచ్చిన వాడిలా.

"నిన్ను కూడా మర్చిపొయ్యే ప్రమాదం వుంది" అంది నవ్వుతూ. రెండు నిమిషాల తరువాత, మీటింగ్ మొదలైనాక హఠాత్తుగా "నాకీ జ్ఞాపకాల్ని పోగొట్టుకోవడం ఇష్టం లేదు. ఈ మరణం, వేదన, ఆందోళన, భయం, కోరిక, పోరాటం - నాకు సైనికురాలిగా జీవించడమే ఇష్టం" అంది సీరియస్‌గా ముఖం పెట్టి.

* * *

జ్ఞాపకాల్ని పోగొట్టుకోవడమే! ఎందుకో క్షణంపాటు జలదరింపులా తోచింది. ముఖ్యంగా మోహిని గురించిన జ్ఞాపకాలు.

అనార్కిక్‌గా తిరుగుతున్న రోజుల్లో, ఒక అపరిచితం మంచి స్నేహంగా, క్రమంగా ఒక అవసరంగా మారింది మోహిని. బ్లూమూన్‌లో సమోసాలు, పారడైజ్‌లో కబాబ్‌లు, స్కూటర్‌పై రాత్రి పదిగంటల వేళ షికార్లు. ఏ పారాపెట్ దగ్గరో, చౌరస్తా మలుపు దగ్గరో ఆగి, పొల్యూషన్ మరకలు లేని నిర్మలమైన ఆకాశాన్ని ఎంజాయ్ చేస్తూ - ఏ పోలీసువాడో కేక వేసినాక, అక్కణ్ణుంచి కదిలి, మళ్ళీ స్కూటర్‌పై ప్రయాణిస్తూ, ఏ చార్మినార్, చాదర్‌ఘాట్ వైపో వెళ్ళి, మధ్యలో టీస్టాల్ దగ్గర ఆగి ఫ్రెష్‌గా చాయ్ తాగి ఏ రాత్రి రెండింటికో ఆమెనట్లా విద్యానగర్ దగ్గర వదిలి, నేనిటు యూనివర్శిటీ వైపు వెళ్ళటం - నెలకో, రెండు నెలలకో హఠాత్తుగా మోహావేశం కలిగేది. 'రాస్కెల్!' అంటూ తిడుతూనే "డిస్కవర్ సమ్ ప్లేస్!" అనేది. ఏ ఓడియన్ థియేటర్ పక్కనో, అఫ్జల్‌గంజ్ ఇరుకు సందులోనో హోటల్ దొరికేది.

ఒకసారి త్రీకేజిల్ రెస్ట్‌హౌస్‌లో.... రూమ్ అంతా ఉక్కగా ఉంది. గదిలో ట్యూబులైటు లేదు. డిమ్‌లైట్. రూమ్ అంతా నీలంరంగులో కలల్ని పెయింట్ చేసిన ప్రదేశంలా ఉంది.

కిటికీ పైన చ్రిప్... చ్రిప్... అంటూ ఏదో పక్షి అరుస్తుంది. మోహిని థ్రిల్ అయ్యింది. నన్నూ, గదినీ మర్చిపోయి, కిటికీ దగ్గరకు వెళ్ళింది. చ్రిప్... చ్రిప్ గొప్ప మోహాన్ని కలిగిస్తుంది దాని అరుపు. "పక్షులు పునరుజ్జీవనానికి గుర్తులు!" అంటూ కిటికీ దగ్గర సెటిల్ అయ్యింది. రెండు గంటలపాటు దాన్నే చూస్తూ... ఆమెను డిస్ట్రబ్ చెయ్యదలచుకోలేదు. కిటికీ కవతల చీకటి. మినుక్కు మినుక్కుమంటూ ఆ పక్షి, దాని ఎదురుగా మోహిని. అద్భుతమైన దృశ్యం.

మంచంపై అలసటగా పడుకొని ఉంది మోహిని. కాసేపటి తరువాత అనాచ్ఛాదితమైన ఆమె శరీర భాగాలపై చప్పుడు చెయ్యకుండా అడుగులు వేస్తూ కనిపించింది ఆ పక్షి. లేత ఎరుపురంగు రెక్కలు దానివి. గాఢమైన చిక్కనైన అనుభూతికి గుర్తుగా వుంది దాని రంగు. అది అట్లా చప్పుడు చెయ్యకుండా మోహిని శరీరంపై అడుగులు వేస్తూ, దాదాపు ఇరవై నిమిషాల పాటు విహారం సాగించింది. మోహిని నిద్రలాంటి, ట్రాన్స్‌లాంటి స్థితిలో వుంది. కాసేపటికి ఆ పక్షి గొప్ప పారవశ్యంతో రెక్కలు విప్పి కిటికీలోంచి టపటపమంటూ ఎగిరిపోయింది. 'అది నా అల్టర్ ఎగో. పారవశ్యంలో వున్నప్పుడు నాలోంచి అట్లా బయటకు వస్తుంది' అనేది మోహిని మిస్టిక్‌గా చూస్తూ.

ఎట్లా వదలుకోగలనీ జ్ఞాపకాలు!

"హలో!" చిరపరిచితమైన గొంతు విని ఉలిక్కిపడ్డాను. మోహన సుందరం. దట్టమైన గడ్డం. ఖాదీ లాల్చీ, పైజామా. ప్రవక్తలా ఉన్నాడు. 'హలో!' అని చెప్పి మా పక్కన కూలబడ్డాడు. వస్తూనే వెంట ఒక కుందేలు పిల్లను తెచ్చాడు. అది ఎరుపు రంగులో వింతగా వుంది. దాన్ని వడిలో కూర్చోబెట్టుకొని, దాని వీపునూ, తలనూ నిమురుతూ, మోహనసుందరంలాగే అదీ ఒక మిస్టిక్ జంతువులా తోచింది.

నా ఆలోచనల్ని చదివినవాడిలా, "ఇది మిస్టిక్ ఏనిమల్ కాదు! ఎర్ర కుందేలు. దాదాపు అంతరించిపోతున్న జాతిలోనిది. బహుశా దీని జాతిలో ఇదే చివరిదేమో! వెంకటాపురం బొందలగడ్డలో దొరికింది!" అన్నాడు.

"నగర శివార్లలో వున్న వెంకటాపురం బొందలగడ్డలో యాభైకి పైగా బేగారీ కుటుంబాలున్నాయి. శవాల్ని దహనం చెయ్యటం వాళ్ళ వృత్తి. శ్మశానం పక్కనే వాళ్ళ యిళ్ళు. వారంరోజుల క్రితం, పొద్దున్నే నిద్ర లేచేసరికి, వాళ్ళ ఇళ్ళు కనబడలేదు. సిమెంటు రేకులు, తాటాకులతో వేసుకొన్న ఇళ్ళు పునాదుల్తో

సహా మాయమయినాయి. వందమంది బేల్దారీలు, క్రషింగ్ మిషన్లు, సిమెంటు బస్తాలు, ఇసుక లారీలు ప్రత్యక్షమయినాయి. అపార్ట్‌మెంట్లకు పునాదులు ప్రత్యక్షమయినాయి. బేగారోళ్ళకు అంతా కలలాగే వుంది. శవాల్ని కాల్చటం, మనిషి బొక్కలతో 'ఆత్మకథలు' చెప్పుకొంటూ బ్రతికే వీళ్ళ బ్రతుకే ఒక కథ అయ్యింది. ఉండటానికి ఇల్లు లేదు. "మీ శవాల్ని మేం కాల్చం పో!" అంటూ వాళ్ళు పిల్లాపాపల్తో ఎటో వెళ్ళిపోయారు. కులనిర్మూలనా పోరాట సమితి తరపున అక్కడకు వెళ్ళాము. నాలుగురోజుల పాటు అక్కడ ధర్నా చేసి అపార్ట్ మెంట్లు కట్టడం ఆపేంగానీ, బేగారోళ్ళు ఏం అయ్యారో కనుక్కోలేకపోయాము. వాళ్ళకోసం వెతుకుతుంటే గోరీల మధ్య, తుప్పల మధ్య ఇదుగో ఈ ఎర్ర కుందేలు కనిపించింది."

గుండెలు టపటపా కొట్టుకొన్నాయి. ఒక అనీజీనెస్ శరీరమంతా పాకింది. ఈ మోహనసుందరం చెప్పే కబుర్లన్నీ ఇట్లాగే ఉంటాయి. గాఢంగా నిట్టూర్చి "మోహనా! నీతో మాట్లాడుతుంటే, సుదీర్ఘమైన దుఃఖగాథను వింటు న్నట్టుగా - నువ్వు కమ్మటి కబుర్లు చెప్పే కాలమెప్పుడొస్తుంది?" అన్నాను.

నావైపు తీవ్రంగా చూసి - "అంతటా కత్తులు దూసి వున్నాయి. అద్భుత మైన సంగీతాన్ని వినిపించే పరికరాలన్నీ పగిలిపొయ్యాయి. దుఃఖమే! నిరాశే! అయినా భయం లేదు. మనమెప్పుడూ ఆశాజీవులమే" అన్నాడు ప్రవక్త ముఖంతో.

కాసేపటికి ఏదో గుర్తుకొచ్చినట్టుగా "లే! అట్లా లకడీకాపూల్ వైపు వెళదాం. అక్కడో తమాషా అయిన దృశ్యం చూపిస్తాను" అంటూ బయలు దేరదీశాడు. మోహిని కూడా కదిలింది. ఎర్ర కుందేలును చేతిలోకి తీసుకొంది.

రోడ్డుపై నడిచే స్థలం కనబడడం లేదు. అటూ ఇటూ వందల కార్లు. మధ్యాహ్న సమయం. ట్రాఫిక్ లైట్లు వెలగడం లేదు. కార్లు నిరంతరంగా వెళుతూనే ఉన్నాయి. దాదాపు పదిహేను నిమిషాలు గడిచాయి. కోపం వచ్చిన వాడిలా పరిగెత్తే కార్ల నడుమకు నిర్లక్ష్యంగా నడిచాడు మోహనసుందరం. క్రీచ్ మంటూ బ్రేకులు పడి కార్లన్నీ ఒకదాని తరువాత ఒకటి ఆగిపోయాయి. సముద్రాన్ని చీల్చిన మోజస్‌లా రోడ్డుకావైపు మోహనసుందరం. మాతోపాటు మరో ఇరవైమంది రోడ్డు దాటారు. మోహిని చివరగా రోడ్డును దాటింది. కార్లు మళ్ళీ కదిలాయి.

అంతలో మోహిని చేతుల్లో వున్న ఎర్ర కుందేలు చెంగున రోడ్డుపైకి దూకింది. రోడ్డుపై దూకిన ఎర్ర కుందేలుపై మారుతీ కారు దూసుకుపోయింది. వింత మూలుగు. రోడ్డు నిండా రక్తం.

హతాశుడైపోయాడు మోహనసుందరం. ముఖం నల్లగా, కోపంగా నిప్పుల సముద్రంలా - రోడ్డుపై మున్గాళ్ళపై కూర్చుని, రక్తంతో తడిసిన ఎర్ర కుందేలును చేతుల్లోకి తీసుకొని "ఇది కావాలనే ఆత్మహత్య చేసు కొంది" అన్నాడు.

"మీరు వెళ్ళండి! దీన్ని ఎక్కడైనా క్రిమేట్ చేసి వస్తాను" అంటూ జనం మధ్యలోకి అదృశ్యం అయ్యాడు మోహనసుందరం. దూరం నుంచి అతను మరణాన్ని చేతుల్తో మోసుకెళ్తున్న ప్రవక్తలా వున్నాడు.

* * *

మోహినీ, నేనూ రోడ్డువారనే అట్లా లకిడీకాపూల్ వైపు నడుస్తూ - ఒకచోట ఒక దృశ్యాన్ని చూసి ఉలిక్కిపడి, భయపడి ఆగిపోయాను. రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై శవాలు కుప్పలుకుప్పలు పోసినట్టుగా. ఒకదానిపై ఒకటి. ఇప్పుడే భూమిలోంచి తవ్వి తీసినట్టుగా, శవాల గుట్టల పక్కనే తెగిన కాళ్ళు, చేతులు, ఒంటరి తలలు. భయంతో కాళ్ళు వణికిపోయాయి. సన్నని నవ్వు వినబడి వెనక్కు చూశాను. మోహిని. "వాళ్ళ మాజికల్ భ్రమలోకి నువ్వూ పడి పోయావా? అచ్చు మనుషుల్లాగే ఉన్నారు కదూ... అవి టెర్రకోట బొమ్మలు. వారం నుంచీ చూస్తున్నాను. రోజూ ఆఫీసు నుంచి సరాసరి ఇక్కడికే వచ్చి - ఈ మనిషి గుట్టల పక్కన చాలాసేపు కూర్చుని వచ్చేదాన్ని. గొప్ప కళారూపం మొత్తం ఆరుగురు ఉన్న కుటుంబం. వీటిని అమ్మాలనే ఉద్దేశం కూడా వాళ్ళకు వున్నట్టు లేదు. జనం వస్తారు, మెచ్చుకొంటూ వెళ్ళిపోతారు. ఎవరూ కొనడానికి సాహసించరు. "ఎందుకిట్లా శవాల బొమ్మల్ని చేశారు? ఎవరూ కొనరు కదా? అని చాలాసార్లు వాళ్ళను అడిగాను. వాళ్ళ నోటివెంట మాట బయటకు రాదు. ఈ బొమ్మలంత మౌనంగా, నిర్జీవంగా. ఆడమనిషి మాత్రం అప్పుడప్పుడు కళ్ళ నీళ్ళు వత్తుకొంటూ ఉంటుంది. ఆ ముసలాయన ఆమె తండ్రో, మామో అయ్యుంటాడు. మండుతున్న కళ్ళతో, ఆయన కళ్ళలో ఏదో గాయపడినతనం. కారణం చెప్పరు. ఆ ముసలాయన నాకో అంతుపట్టని మిస్టరీ. నిన్న మాత్రం ఆ ఆడమనిషి తెగించి బొమ్మల ముందో గుడ్డ పరిచింది. రూపాయి బిళ్ళలు, ఐదు, పది నోట్లు. డబ్బులు బాగానే పోగయినాయి. ఆ ముసలివాడు మాత్రం శపిస్తున్న మహర్షిలా."

ఆ బొమ్మల దగ్గర అట్లాగే నిలబడిపోయాము నేనూ, మోహిని. అసాధా రణమైన సృజన. మోహిని చెప్పింది నిజం. ముసలివాడు మహా క్రోధంతో ఉన్నాడు. దీక్షగా మట్టిని పిసుకుతున్నాడు. మరో బొమ్మను తయారు చేసే ప్రయత్నమేమో?

పక్కనున్న రెస్టారెంటు నుంచి రెండు కప్పుల టీ తెచ్చుకొని అక్కడే కూలబడ్డాం. ఒక మాజికల్ షో. ఎర్రెర్రని మట్టిలోంచి సజీవ రూపం బయటకు వస్తుంది. గొప్ప తేజస్సు, భుజసంపద వున్న మగవాడి రూపం. పల్లెటూరి రైతు రూపం. మొలకు అతుక్కుపోయిన పంచె. గొప్పగా కార్వ్ చేస్తున్నాడు. 'శభాషో' అనుకుంటున్నంతలో, హఠాత్తుగా బొమ్మ మెడ సగానికి తెంచి, ముఖానికి మళ్ళీ టచ్ ఇవ్వడం మొదలుపెట్టాడు. మరణపు పోలికలు ముఖం పొడవునా పులుముతున్నాడు. గుండె పిండివేసినట్లయింది. క్షణంపాటు అతనిపై కోపం కూడా వచ్చింది. మోహిని, నా చేతిని బలంగా నొక్కి పద అంటూ బయలుదేర దీసింది.

రోడ్డు అంచునే చాలా దూరం నడిచాం. ఎందుకో మాట్లాడుకోవాలని పించలేదు. "ముసలాడేదో శాపాన్ని పెట్టినట్టున్నాడు. మాటలు పడిపోయి నట్టుగా అయింది!" అన్నాను మోహినితో.

"జానపదుల శాపం" అంది మోహిని దిగులులాంటి నవ్వుతో.

"ఇక ఈ దిగులును అభినయించటం మాని ఏదైనా బస్సు ఎక్కుదాం! ప్రగతినగర్ వెళ్దాం అన్నావు కదా! గొప్ప చరిత్రాత్మకమైన క్షణాలకు దగ్గరలో వున్నాం. కొత్త మిలియనమ్‌లోకి వెళ్లబోతున్నాం. ఈ దిగులును, కాఫ్కామార్కు శాపాల్ని పక్కనబెడదాం. మంచి బిరియానీ, కేక్‌లు, రెండు మూడు కోక్ టిన్నులు పాక్ చేయించుకురా. మనదైన శైలిలో కొత్త మిలియనమ్‌కు ఆహ్వానం పలుకుదాం."

మోహిని బస్టాప్ వైపు దారితీసింది.

* * *

రాత్రి మౌనంగా, ఒంటరిగా, లోలోపల రగులుతున్న అడవిలా ఉంది. కుకట్‌పల్లి హౌసింగ్ బోర్డు చౌరస్తా తరువాత వచ్చే పొడవైన కచ్చా రోడ్డు. మెయిన్‌రోడ్డులోంచి చీలి ఒక రహస్య లోకంలోకి ప్రయాణిస్తున్నట్టుగా. నగర కోలాహలం, మోటారు వాహనాల రాక్షస చప్పుళ్ళు, నియోన్ లైట్ల వెలుతురు హింసలు - ఏమీలేని ప్రదేశం. అమాయకంగా, ఒంటరిగా, దయాపూరితంగా వుందా ప్రదేశం. రోడ్డుపై పెద్దగా అలికిడి లేదు. కాస్త దూరం వెళ్ళినాక రోడ్డు హఠాత్తుగా ఒక అద్భుతమైన సరస్సులా మారిపోయింది. అక్కడంత పెద్ద చెరువు వుంటుందని ఊహించలేకపోయాం. హఠాత్తుగా ప్రత్యక్షమైన మాయా సరోవరంలా వుంది. చెరువు మధ్యలో చిన్నవంతెన. వంతెనపై పొడవాటి మెట్టు.

మెట్టుపై కూర్చొన్నాక గొప్ప హాయి, తృప్తి కలిగాయి. చెరువు కవతల చిన్నచిన్న రాళ్ళ గుట్టలు. అవి అందంగా శిల్పాల్లా నిల్చున్నాయి.

మోహిని కళ్ళలోని పారవశ్యం స్పష్టంగా తెలుస్తోంది. సన్నటి కూని రాగంలా మొదలుపెట్టి గొప్ప పాటలా రూపాంతరం చెందింది. "ఎంకి ఎవ్వ రంటే..." అంటూ పాటను అందుకొంది. కళ్ళలో తడి. గుండెలో మధువు. చ్రిప్... చ్రిప్... ఎక్కడో పక్షి సన్నగా కూస్తుంది. మోహినిని గుర్తుపట్టేనని చెప్పే సంకేతమా? టపటపమంటూ ఎగిరి మేం కూర్చున్న గట్టు దగ్గరకు వచ్చేసింది. "నా ఆల్టర్ ఎగో... నా వెంటే వస్తుంది" అని దానివైపు చూసింది మోహిని. పలచటి వెన్నెల వెలుగులో దాని లేత ఎరుపురంగు రెక్కలు ఎర్రగా మిలమిల లాడుతున్నాయి. 'పంఛి బనూ వుడ్‌తె ఫిరూ మస్త్ గగన్‌మే..." అంటూ లతా పాటను అందుకొంది మోహిని. గాఢమైన నిశ్శబ్దంలో ఒంటరి పాట మధురంగా మోగింది. సంచిలోంచి బిరియానీ, కోక్ బాటిల్స్ బయటకు తీశాను.

రాత్రి వేగంగా పరుగెత్తుతుంది. కాలనీ ఇళ్ళలోని లైట్లు ఒక్కొక్కటే ఆరిపోతున్నాయి. చిక్కనవుతుంది చీకటి.

ఒక రహస్యపు కోరిక మెల్లగా రెక్కలు విప్పుకుంది. చెరువు గట్టునే అట్లా లోపలికి నడిచి, కొంచ కొద్దిగా ముందుకు వంగి చెరువును ముద్దు పెట్టుకొంటున్నట్లున్న ప్రదేశం వైపు వెళ్ళాం.

పక్షులు చ్రిప్... చ్రిప్ మంటున్నాయి. నీటిలో అప్పుడప్పుడు బుడుంగు మంటూ శబ్దం వస్తుంది. సన్నటి రవ్వగాలి. హాయిగా శరీరాన్ని తడుముతుంది.

ఆదాముగా, అవ్వగా, సాతానుగా, భగవంతుడిగా రూపాంతరం చెంది – పండు వెన్నెల్లో మోహిని నగ్నవక్షం మిలమిలలాడుతోంది. చ్రిప్... చ్రిప్ పక్షి దగ్గరలోనే ఎక్కడినుంచో చప్పుడు చేస్తుంది. ఆ మహా సౌందర్యంలో లీనమవ డానికి ముందుకు వంగేను.

హఠాత్తుగా కనులు మిరుమిట్లు గొలిపే బ్రహ్మాండమైన కాంతి. భయం తో ఉలిక్కిపడ్డాము. "ఏమైంది? ఏమైంది?" అంటూ మోహిని తుళ్ళిపడింది. కాంతి అంతకంతకూ పెరుగుతుంది. మోహిని సిగ్గుతో చీరను ఒంటినిండా కప్పుకొంది. సరస్సు నిండా కాంతి. లక్షదీపాలు భగ్గుమన్నట్టు. ఎవరో పరుగెడు తున్న శబ్దం. కరుకు బూట్ల చప్పుడు. ఏం జరుగుతుందో అర్థంకాలేదు. ఒంటికి బట్టలు బిగించుకొని, భయంతో గుట్టచాటు నుంచి బయటకు వచ్చాం. పోలీసు జీపులు చెరువు గట్టున ఆగి వున్నాయి. 'ధన్' మంటూ చప్పుడు. ఆ చప్పుడు తుపాకిది. ధన్‌మంటూ మరోసారి మోగింది.

భయం గొలిపే ఒక మూలుగు, చావుకేక క్షణంపాటు మాత్రమే విన బడ్డాయి. మరణహింస తాలూకు పెనుగులాట మాత్రం చాలాసేపటి వరకూ వినిపిస్తూనే వుంది. రెండు నిమిషాల తరువాత ఒక్కసారిగా వెలుతురు ఆగి

పోయింది. ఎంత హఠాత్తుగా ప్రత్యక్షమైందో అంత హఠాత్తుగా అదృశ్యమైంది. జీపులు కదులుతున్న శబ్దం. షేడౌట్ అవుతున్న దృశ్యంలా వెలుతురు, హింస అన్నీ మాయమైపోయాయి. మళ్లీ చెరువు, కొండలు, మాయతెరలా అల్లుకొన్న వెన్నెలా, మేమూ మిగిలాము.

భయంగా అటువైపు నడిచాము. నీటి ఒడ్డున స్త్రీ మృతదేహం. కడుపులో శిశువు. నీళ్ళపై తేలుతూ భయం గొలిపేదిలా ఉంది. తట్టుకోలేని వ్యథతో ఒక్కసారిగా నేలపై కూలబడి రోదించడం మొదలుపెట్టింది మోహిని. మోహినిని పైకి లేవదీసి, భుజంపై ఆన్చుకొని రోడ్డువైపు అడుగులేస్తుండగా, దూరంగా సిటీలోంచి ఒక్కసారిగా కేకలు, కోలాహలం. "హ్యాపీ న్యూ యియర్!", "వెల్‌కం టు న్యూ మిలీనియం" అంటూ అరుపులు.

కేకల వైపుకు, జనసముద్రం వైపుకు భయంతో అడుగుల వెయ్య సాగాము.

ఎరుపురంగు రెక్కల పక్షి, మృతదేహం దగ్గర తచ్చాడుతూ కన్పించింది.

చ్రిప్... చ్రిప్ దాని అడుగుల చప్పుడు స్పష్టంగా బిగ్గరగా విన్పిస్తూనే ఉంది.

*– ఆదివారం ఆంధ్రజ్యోతి, 2 మే, 1999*